క్లుప్తంగా

చిన్నారికి మాజీ మంత్రి ఆశీస్సులు



హరిణిని ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు: మున్సిపాలిటీలోని 19వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు లోకనాథం(కుట్టి), నిరోషా దంపతుల కుమార్తె హరిణి ఓణీల ఫంక్షన్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. లోకనాథం ఇంటికి విచ్చేసిన ఆమె హరిణిని ఆశీర్వదించి, బహుమతి అందజేశారు. మాజీ మంత్రి వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

కాలభైరవుడికి వరుణాకర్షణ పూజలు



ప్రత్యేక అలంకరణలో కాలభైరవ స్వామి

నగరి: శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర స్వామి ఆలయంలోని కాలభైరవ స్వామి సన్నిధిలో మంగళవారం శుభ అష్టమి పర్వ దినం సందర్భంగా వరుణాకర్షణ పూజలు నిర్వహించారు. స్వామికి 108 కొబ్బరికాయల నీటితో అభిషేకాలు జరిపి వర్షం కోసం ప్రార్థించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలకు కొబ్బరికాయలను అందించారు. పూజల సమయంలోనే వర్షం పడడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. అభిషేకం అనంతరం స్వామిని పుష్పాలు, నిమ్మకాయల మాలలతోపాటు వడమాలతో అలంకరించారు. పూజలనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆక్రమిత ప్రాంతాల్లో ఫెన్సింగ్ తొలగింపు



ఫెన్సింగ్ తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

నగరి: మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామంలో ఓ వ్యక్తి ఆక్రమిత స్థలంలో వేసిన ఫెన్సింగ్‌ను తహశీల్దార్ రవికుమార్ తొలగించారు. మంగళవారం సంబంధిత ప్రాంతానికి వెళ్లిన ఆయన రెవెన్యూ సిబ్బంది సాయంతో ఫెన్సింగ్‌ను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోనే ఈ ప్రాంతంలో ఆక్రమణలను స్వాధీనం చేసుకున్నామని అనంతరం దీనిపై కోర్టు స్టేటస్‌కో ఇచ్చి ఉందన్నారు. కోర్టు నిబంధనలకు విరుద్ధంగా వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

క్రైస్తవుల ఉపవాస ప్రార్థనలు



శాంతి కోసం ఉపవాస ప్రార్థనలు

కార్వేటినగరం: యుద్ధం ఆగాలని మండల కేంద్రంలోని బేతేల్ షారోన్ చర్చిలో మంగళవారం గెత్సెమెన్ ప్రార్థనా బృందం ఆధ్వర్యంలో 7 గంటల ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న పాస్టర్లు ఎలీషా, దిలీప్ మాట్లాడుతూ దేశం కోసం వీర మరణం పొందిన సైనికుల కుటుంబాల్లో ప్రభువు ధైర్యాన్ని నింపాలని ప్రార్థనలు చేసినట్లు పేర్కొన్నారు. వీర జవాన్ మురళీ నాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఆశీర్వాదం, బాబు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై రైతులకు అవగాహన

నింద్ర: మండలంలోని అగరం గ్రామంలో రైతులకు చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అదే విధంగా సజ్జ పంట సాగుపై తీసుకోవాల్సిన సూచనలు ఇచ్చారు. విత్తన శుద్ధి చేయడంతో రైతులకు మేలు జరిగే అంశాలను వివరించారు. రైతులు సజ్జపంటలో కలుపు నివారణ, సస్యరక్షణ చర్యలను వివరించారు. అనంతరం రైతులకు విత్తన శుద్ధి మందులపై అవగాహన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ తులసీరాం, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో మంగళవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం అమ్మవారికి విశేష పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహిళలు దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వంగ.. ఏడాదంతా లేదిక బెంగ

- వంకాయ సాగుతో అధిక లాభాలు
- తగు సూచనలు పాటిస్తే మంచి దిగుబడి



వంగ తోటలో కలుపు తీస్తున్న కూలీలు

పాలసముద్రం: కూరగాయల్లో ప్రధానమైనది వంకాయ. వంగ సాగులో చీడపీడలు నివారిస్తే ఏడాది పొడవుతునా దిగుబడి పొందవచ్చు. వంకాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కొద్దిపాటి జాగ్రత్తలు వహిస్తే నాణ్యమైన పంట చేతికొస్తుంది. వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల సూచనలు పాటించి తెగుళ్లను నివారిస్తే మంచి ఆదాయం ఆర్జించవచ్చని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు.

విత్తన ఎంపిక కీలకం

మేలు రకాలైన వంగ విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. సరైన పద్ధతుల్లో సాగు చేస్తే నాణ్యమైన దిగుబడి సాధించవచ్చు. వంకాయల రకాల్లో భాగ్యవతి, అర్కకుసుమాకర్, హైబ్రీడ్, అర్కషీల్ రకాలైన మహికో, రవయ్యా, సుఫల్ ఉన్నాయి. విత్తన రకాలను బట్టి దిగుబడులు వస్తాయి.

భాగ్యవతి రకం: చెట్టుకు మూడు నుండి నాలుగు కాయలు ఉంటాయి. ఊదా రంగులో అండాకారంగా కాయలు ఉంటాయి. పంటకాల పరిమితి 140 నుంచి 160 రోజులు. ఇది నీటి ఎద్దడి బాగా తట్టుకునే శక్తి కలిగి ఉంటుంది. హెక్టార్‌కు 25 నుంచి 30 టన్నులు దిగుబడి వస్తుంది.



పుల్లయ్యగుంట గ్రామంలో వంగ తోట

అర్కషీల్ రకం: కాయల మధ్యస్థంగా పొడవుగా ఆకర్షణీయమైన ముదురు ఊదా రంగులో ఉండి గింజలు తక్కువగా ఉంటాయి. కాలపరిమితి 110 రోజుల నుంచి 120 రోజులు. హెక్టారుకు 380 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

అర్కకుసుమాకర్ రకం: కాయలు చిన్నగా వేలు ఆకారంతో, ఆకు పచ్చరంగులో ఉంటాయి. కాయలు ఐదు నుంచి ఏడు వరకు గుత్తులుగా కాస్తాయి. మొక్కకు 70 నుంచి 75 వరకు కాయలు దిగుబడి వస్తాయి. కాలపరిమితి 110 నుండి 120 రోజులు. హెక్టారుకు 35 టన్నులు వరకు దిగుబడి వస్తుంది.

పురుగు నివారణ చర్యలు

పిండి పురుగులు: వీటి వల్ల మొక్కలు గిడసబారుతాయి. దీని నివారణకు మలాథియాన్ పిచికారీ చేయాలి. పురుగు ఆశించిన రెమ్మలు, కాయలను ముందుగా తీసి నాశనం చేయాలి.

రసం పీల్చే పురుగులు: ఇవి ఆకుల అడుగు భాగాన ఉండి రసాన్ని పీలుస్తాయి. ఆకులు వడలి పసుపు రంగుకు మారి ఎండిపోతాయి. దీని నివారణకు డైమిథోయేట్ 30 శాతం ఇ.సి మందు రెండు మిల్లీ లీటర్లు చొప్పున ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



అక్షింతల పురుగు: ఇవి పెద్ద పురుగులు, పిల్లపురుగు ఆకుల్లో పత్రహరితాన్ని తినేసి ఈనెలను మిగులుస్తాయి. ఆకు జల్లెడ మాదిరిగా కనిపిస్తుంది. ఆకులు ఎండిపోయి మొక్కలు శక్తిహీనంగా ఉంటాయి. దీని నివారణకు 0.16 శాతం మలాథియాన్ 3 మిల్లీలీటర్లు గానీ 0.03 శాతం మిథైల్ పెరాథియాన్ ఒక మిల్లీలీటరు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మొవ్వ, కాయ తొలుచు పురుగు: చిరుమొవ్వ దశలో ఉన్నప్పుడు ఇవి ఆశించడంతో మొక్కలు వంగిపోతాయి. కాపు దశలో కాయలను తొలిచి అంచెలంచెలుగా కాయ లోపలికి చేరుతాయి. దీని నివారణకు పురుగు ఆశించిన, వంగిన రెమ్మలను తీసివేసి 50 శాతం డబ్ల్యూపీ 2.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.25 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ మందు పిచికారీ చేసిన పది రోజుల తర్వాత కాయలు కోసుకోవాలి.

ఆకుముడత తెగులు: ఈ తెగులు సోకిన ఆకులపై అక్కడక్కడా గోధుమ రంగుతో కూడిన మచ్చలు కనిపిస్తాయి. ఉధృతంగా తెగులు సోకితే ఆకులు రాలిపోతాయి. ఈ తెగులు సోకిన కాయలు పసుపు(ముదురు)రంగులోకి పూర్తిగా మారకముందే ఎండిపోతాయి. దీని నివారణకు బ్లైటాక్స్ 3 గ్రాములు లీటరు నీటిలో లేదా 2.5 గ్రాములు జినేట్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వెర్రి తెగులు: ఈ తెగులు ఆశించిన ఆకులు పాలిపోయిన ఆకుపచ్చ రంగును కలిగి ఉంటాయి. వీటి నివారణకు తెగులు సోకిన మొక్కలను పెరికి వేయాలి. తెగులు వ్యాపింపజేసే చీడలను క్రిమిసంహారక మందులను ఉపయోగించి నివారించాలి.

ఎరువు వాడే విధానం



ఆఖరి దుక్కిలో హెక్టార్‌కు 60 కిలోల పొటాష్, భాస్వరాన్ని ఇచ్చే ఎరువు వాడాలి. హెక్టార్‌కు వంద కిలోల నత్రజని మూడు భాగాలుగా చేసి 30వ రోజు, 75వ రోజున వేయాలి. ఎరువు వేసిన సమయంలో కలుపు తీసి, గొర్రు తవ్వి మట్టిని సవరిస్తే పంట దిగుబడి పెరుగుతుంది. భూమిలో తేమను బట్టి, వేసవిలో 4 నుంచి 5 రోజులకు, శీతాకాలంలో 7 నుంచి 10 రోజులకో సారి, వర్షాకాలంలో అవసరాన్ని బట్టి నీరు కట్టాలి. - **ఢిల్లీప్రసాద్, మండల వ్యవసాయాధికారి**

నేడు కాపు సంఘం ఆత్మీయ సమావేశం

నగరి: పట్టణ పరిధిలోని ఎస్‌వీజీ రెసిడెన్సీ ఫంక్షన్ హాలులో బుధవారం ఉదయం 10.30 గంటలకు జాతీయ కాపు సంఘం తరపున నియోజకవర్గ కాపు సంఘం సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు నియోజకవర్గ కాపు సంఘ అధ్యక్షుడు ఎంపీ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దళిత విద్యార్థిపై దాడి దారుణం



ఈజీ బాబు

నగరి: తిరుపతిలో ఇంజినీరింగ్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌ను కిడ్నాప్ చేసి దారుణంగా హింసించడం దారుణమని, ఇంత జరిగినా కూడా పోలీసులు కనీసం ఫిర్యాదు కూడా స్వీకరించకపోవడం వెనుక కూటమి ప్రభుత్వ చేతగానితనం స్పష్టమవుతోందని వైఎస్సార్ సీపీ నగరి లీగల్ సెల్ అధ్యక్షుడు ఈజీ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నిందితులను కాపాడడంలో కూటమి ప్రభుత్వ నాయకులు పోలీసులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న రాజకీయ పార్టీలు దళితులకు ఎంత ద్రోహం చేస్తున్నారో, దళిత సామాజిక వర్గాన్ని అణగదొక్కేందుకు ఎంతగా ప్రయత్నిస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలలన్నారు. ఇకనైనా బాధ్యతతో వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో చలో తిరుపతి కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు.

వైభవంగా జాతర ప్రారంభం





కార్వేటినగరం: పాదిరికుప్పం నడివీధి గంగమ్మ, పాలసముద్రం: అలంకరణలో బాటగంగమ్మ తల్లి

కార్వేటినగరం: మండలంలోని పాదిరికుప్పం గ్రామంలో మంగళవారం ఉదయం నుండి నడివీధి గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. గ్రామంలోని వీధులన్నీ వేపాకు తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు అర్చనలు చేశారు. గ్రామ పూజారులు అంబలిని అమ్మవారికి నైవేద్యంగా పెట్టి భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం నిప్పుల పోలాక్షమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అనంతరం భక్తి శ్రద్ధలతో జ్యోతిని ఊరేగింపుగా తీసుకొచ్చి గ్రామంలో వెలసి ఉన్న నడివీధి గంగమ్మ ఆలయంలో ప్రతిష్టించడంతో జాతర వేడుకలు ప్రారంభమయ్యాయి. రజకులు అందించిన మొదటి హారతిని అందుకున్న అమ్మవారు పురవీధుల్లో ఊరేగారు. కార్వేటినగరం పెద్ద దళితవాడ, టీకేఎం పేట గ్రామాల్లో కూడా నడివీధి గంగమ్మ ఊరేగింపు చేపట్టారు.

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ కన్నికాపురం గ్రామంలో వెలసిన బాట గంగమ్మకు కొలువు మహోత్సవంలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు, వివిధ అభిషేకాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి గరిగెను పూలతో అలంకరించి గ్రామాల్లో రేగించారు. మధ్యాహ్నం అమ్మవారిని వివిధ అభిషేకాలు చేసి, అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం పాలు, చందనం, పసుపు నీటితో అభిషేకించారు. సుందరంగా అలంకరించి ప్రత్యేక దీపారాధనలు, పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం, రాత్రి వీధి నాట్యం జరుగునుంది.

పారిశుధ్య సమస్య లేకుండా చూడాలి

నింద్ర: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం సమస్య లేకుండా చూడాలని ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ అన్నారు. మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మురుగు కాలువలు శుభ్రం చేయడం, రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించే కార్యక్రమాలు చేపట్టాలని, తాగునీరు లీకేజీ లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఇళ్ల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. రోగాలు రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలన్నారు. వీధి దీపాలు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల వైద్యాధికారిగా గురుప్రకాష్

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ గురుప్రకాష్ మంగళవారం బాధ్యతల స్వీకరించారు. గతంలో అసోం రాష్ట్రంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చీఫ్ మెడికల్ డాక్టర్‌గా సేవలందించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ దుర్గాదేవి ఉన్నత చదువుల నిమిత్తం వెళ్లగా పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు డాక్టర్ గురుప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గురుప్రకాష్‌కు మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సీహెచ్ఓ శ్రీనివాసులు, ఆసుపత్రి సిబ్బంది స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలియజేశారు.

పదవులు జగనన్న ఇచ్చిన బాధ్యత



మాజీ మంత్రి ఆర్కే రోజాను గజమాలతో సత్కరిస్తున్న గోవర్ధననాయుడు తదితరులు

- మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి: వైఎస్సార్ సీపీ శ్రేణులకు జగనన్న ఇచ్చిన పదవులు పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి, ప్రజలకు అండగా నిలబడడానికి ఇచ్చిన బాధ్యతలని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. పార్టీ రాష్ట్ర పంచాయతీ రాజ్ కార్యదర్శిగా నియమితులైన గోవర్ధననాయుడుతోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం మాజీ మంత్రిని ఆమె స్వగృహంలో కలిసి గజమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో ఆమె మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన పదవులతో పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. పాలక ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారికి అండగా నిలబడాలన్నారు. ఈ సందర్భంగా గోవర్ధన నాయుడు మాట్లాడుతూ తనకు ఇచ్చిన పదవిని బాధ్యతతో నెరవేరుస్తానన్నారు. పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్ రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డికి, మాజీ మంత్రి రోజమ్మకు తాను ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివరాజు, నియోజకవర్గ, మండల కమిటీ, అనుబంధ కమిటీల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను వినియోగించుకోండి



కుట్టుమిషన్ అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

పుత్తూరు: రాష్ట్రీయ సేవా సమితి (రాస్) మహిళలకు అందిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కెనరా బ్యాంకు మేనేజర్ నరసింహులు సూచించారు. సోమవారం స్థానిక రాస్ కార్యాలయంలో టైలరింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు చేతి వృత్తుల ద్వారా ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. తద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. బ్యాంకు ద్వారా రూ.15 వేలు విలువ చేసే టైలరింగ్ మిషన్‌లను ఉచితంగా అందజేశారు. అనంతరం ఉచిత శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, జయంతి, ప్రకాష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గంగమ్మ జాతర

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం, పిళ్లారికుప్పం గ్రామాలలో గంగమ్మ జాతర వేడుకలు అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో అభిషేకం పూజలు నిర్వహించి అంబళ్లు, పొంగళ్లతో నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో పంబ వాయిద్యాలతో ప్రదర్శన కార్యక్రమం భక్తులను అలరించింది.


పట్టాలు సరే.. భూములు చూపండి!



సచివాలయం ఎదుట నిరసన

విజయపురం: గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి స్థలాన్ని లబ్ధిదారులకు చూపించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య ఆరోపించారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో కేవీపురం దళితవాడకు చెందిన కొందరు ఇంటి స్థలం చూపాలని సచివాలయ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోదండయ్య మాట్లాడుతూ విజయపురం మండలం కేవీపురం దళితవాడలో ఇంటి స్థలం లేని 78 మందికి సర్వే నెంబర్ 183లో జగనన్న ప్రభుత్వం ఇంటి స్థలంలో పాటు పట్టాలు ఇచ్చిందన్నారు. అయితే అధికారులు ఇంత వరకు లబ్ధిదారులకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. గత 40 రోజులుగా స్థానిక తహశీల్దార్‌తో పాటు నగరి ఆర్డీఓకు పలుమార్లు వినతి పత్రం ఇచ్చినా స్పందించలేదన్నారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు కె.వి.పురం సచివాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. సీపీఐ నాయకులు యేసయ్య, విజయపురం మండల నాయకులు రవి, గ్రామ కమిటీ నాయకులు రవి, సుబ్రహ్మణ్యం, ఏసు, రాణెమ్మ, పూర్ణమ, జయంతి, రేఖ, జయలలిత పాల్గొన్నారు.

హంసపై వీణాపాణి



హంస వాహనంపై వీణాపాణి

కార్వేటినగరం: కార్వేటినగరంలోని శ్రీవేణుగోపాల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి హంస వాహనంపై సరస్వతీదేవిగా, ఉదయం చిన్నశేష వానంపై వేణుగోపాలుడిగా ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం 7.30 నుంచి 9.30 గంటలకు ఐదు పడగల చిన్న శేష వాహనంపై శ్రీవేణుగానలోలుడు పురవీధుల్లో విహరించారు. స్వామివారి వాహనం ముందు చెక్క భజనలు, కోలాటాలు, మేళ తాళాల నడుమ వాహనసేవ వైభవంగా సాగింది. వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అభిషేకం, పంచాంగ శ్రవణం అర్చన జరిపి నై వేద్యం సమర్పించారు.

ఘనంగా స్నపన తిరుమంజనం

శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ పాలు, పెరుగు, తేనె, చందనం, నారికేళ జలంతో అభిషేకించారు. దవళ వస్త్రంతో స్వామివార్లను శుభ్రం చేసి పవిత్ర తులసి మాలతో అలంకరించారు. తదుపరి కర్పూర నీరాజనాలు సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామివారికి ఊంజల్ సేవ వేద మంత్రాలతో నేత్రపర్వంగా జరిగింది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారు వీణ ధరించి సరస్వతీ రూపంలో హంస వాహనంపై ఆశీనులై పుర వీధుల్లో విహరించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, కంకణభట్టర్ తరుణ్‌కుమార్, వేద పండితులు నారాయణ దాసరి, గోపాలాచారి, శబరీష్, రమేష్, ధన్వంతరి, ప్రశాంత్, పరిచారకులు, టీటీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి వాహన సేవలు

కార్వేటినగరంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం ఉదయం స్వామివారు సింహ వాహనంపై విహరించనున్నారు. సాయంత్రం ముత్యపు పందిరి వాహనంపై నగర వీధుల్లో ఊరేగ నున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.



నగర వీధుల్లో చిన్నశేష వాహనంపై విహరిస్తున్న వేణుగోపాలుడు



వాహన సేవ ముందు చిన్నారుల కోలాటాలు

ఐరన్ మాత్రలతో రక్తహీనత దూరం

పాలసముద్రం: పిల్లల్లో రక్తహీనత తొలగించేందుకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఎంతగానో దోహదపడుతాయని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణీ, బాలింతలకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య పరీక్ష కార్యక్రమానికి ఆయన సందర్శించారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణీలు, బాలింతలతో డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత తొలగాలంటే తప్పకుండా ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వేయాలని తెలిపారు. గర్భిణీలు నెలసరి వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలని, ప్రసవం ప్రభుత్వం ఆస్పత్రిలో చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణీలు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల పరిరక్షణపై అవగాహన

వెదురుకుప్పం: బాలబాలికల పరిరక్షణకు తీసుకోవాల్సిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. మంగళవారం మండలంలోని చవటగుంట అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. చైల్డ్‌లైన్ ప్రతినిధి సవిత, హైమావతి, అంగన్‌వాడీలు విజయకుమారి, జయసుధ, అరుణకుమారి, చిరంజీవి పాల్గొన్నారు.